లాభదాయకంగా మొక్కజొన్న

- మొదలైన ఖరీఫ్ పంట కోతలు
- ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటాల్‌కు రూ.2500 వరకూ ధర


కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఆరబోసిన మొక్కజొన్న


ధాన్యాన్ని సంచులలో నింపుతున్న రైతులు

చిలమత్తూరు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే మండలంలో పలు చోట్ల పంట కోతలు పూర్తవడంతో అమ్మకానికి రైతాంగం సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితులు కాస్త ఇబ్బంది కలిగించినా ఆశించిన స్థాయిలోనే దిగుబడి సాధిస్తున్నారు. చిలమత్తూరు మండలంలో ప్రధాన పంట మొక్కజొన్న కాగా ఖరీఫ్‌లో 7169.6 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. బోర్లు, తడులు ఉండే చోట ఎకరాకు 30 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా ధరలు

మొక్కజొన్న పంటకు ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. క్వింటాల్‌కు రూ.2500 నుంచి 2100 వరకూ ధర పలుకుతోంది. ఇదే ధర కొనసాగితే రైతులు మంచి లాభాలు గడించే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ ధరలు తగ్గినా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ద్వారా ప్రతి ఏటా కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. బోర్ల కింద వేసిన పంటలు దేమకేతేపల్లి, సోమఘట్ట, కోడూరు, టేకులోడు, శెట్టిపల్లి తదితర పంచాయతీల్లో ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. క్వింటాల్‌కు రూ.2100 ధర ఉంటే ఎకరాకు రూ.60 వేల వరకూ ఆదాయం చేకూరనుంది.

ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి



నేను మొత్తం మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ఆ లెక్కన 3 ఎకరాలకు 90 క్వింటాళ్ల దిగుబడి కచ్చితంగా వస్తుంది. కోత పూర్తి చేసి జొన్న ఆరబోశాను. ధరలు తగ్గినా దిగుబడి బాగుండటంతో పంట లాభదాయకంగానే ఉన్నట్లే.

– లక్ష్మీనారాయణరెడ్డి, బ్రహ్మేశ్వరంపల్లి

ధర మరింత ఉంటే బాగుండు



నేను మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ఇప్పుడు పంట చేతికొచ్చింది. 90 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కానీ ధరలు కాస్త తగ్గాయి. మరింత ధర ఉండి ఉంటే ఆదాయం మరింత పెరిగేది. ఈ ఏడాది వర్షాలు బాగానే కురవడం రైతులకు కాస్త ఉపశమనం కలిగింది.

– ఆదిరెడ్డి, బ్రహ్మేశ్వరంపల్లి

వారంలో పంట కోత ప్రయోగాలు

ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేసిన పంటలకు పంట కోత ప్రయోగాలు మరో వారంలో ప్రారంభిస్తాం. ఎంపిక చేసిన పంట పొలాల్లో కోత ప్రయోగాలు నిర్వహించి దిగుబడి నిర్ధారిస్తాం. పంటలన్నీ చివరి దశకు చేరుకున్నాయి. బోరు బావుల కింద వేసిన పంటలకు దిగుబడి బాగుంది.

– వంశీకృష్ణ, మండల వ్యవసాయాధికారి

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత

గోరంట్ల: గోరంట్ల పట్టణంలోని నాల్గవ వార్డుకు చెందిన రొఖయాబీ అనే మహిళ క్యాన్సర్‌తో బాధపడుతూ బెంగళూరులోని కిద్వాయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకొన్న నాల్గవ వార్డుకు వలంటీర్ సద్దాం హుసేన్ బుధవారం బెంగళూరుకు వెళ్లి వితంతు పింఛన్ కింద రూ.2750 అందజేశారు.

రొద్దం: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లికి చెందిన శివలింగమ్మ అనే మహిళ అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ రమేష్ బుధవారం బెంగళూరు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.


రొఖయాబీకి పింఛన్ ఇస్తున్న వలంటీర్ సద్దాం హుసేన్


శివలింగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమేష్

రోడ్డు నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి

హిందూపురం: పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్లు నిర్మాణాలు నాణ్యతగా త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని హిందూపురం సమన్వయకర్త దీపిక తెలిపారు. 3వ వార్డు ఆర్టీసీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ లక్ష్మితో కలసి పరిశీలించారు. స్థానికులతో పాటు కాంట్రాక్టర్‌తో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో పట్టణ, మండలాల్లోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు సదుపాయాలు కల్పించడానికి కృషిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, బాలాజీ, రహంతుల్లా, ఇందాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


మడకశిర: జీవీపాళ్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నఎమ్మెల్యే తిప్పేస్వామి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించారని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం జీవీ పాళ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరై రోగులకు శిబిరం ద్వారా అందిస్తున్న వైద్య చికిత్సలను పరిశీలించారు. అనంతరం రోగులతో వైద్య శిబిరంలో చికిత్సలు ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు భార్గవి, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో సీఎం వైఎస్ జగన్ గ్రామస్థాయిలోనే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. వైద్య, విద్యారంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. విద్యార్థుల చదువులను ప్రోత్సహిస్తూనే.. గ్రామాల్లో ఇంటి వద్దకే ప్రజలకు కార్పొరేట్ తరహాలో ప్రభుత్వం ఉచితంగా వైద్య చికిత్సలు అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, జేసీఎస్ కన్వీనర్ నరేష్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ముర్షావలి, ఈఓఆర్డీ శైలజ, ఎంఈఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని సదాశివనగర్‌లో 5, 7, 21, 29, 30, 31, 32, 33, 34 వార్డులకు ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరమన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పనిచేస్తోందన్నారు. ఇంతవరకు రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, ప్రజల బాగోగులకు కృషి చేయలేదన్నారు.

ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మారుతిరెడ్డి, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, పార్వతి, షేక్ రేష్మా భాను, చిన్నమ్మ, మణి, రోషన్, జిల్లా కార్యదర్శి ఇలియాజ్, పట్టణ ఏ.బి బ్లాక్ కన్వీనర్ సాధిక్, వాటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.


పరిగి మండలం కొడిగెనహళ్లిలో స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


అమరాపురం: గౌడనకుంటలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం



గోరంట్ల: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న న్యాయవాదులు

పెనుకొండ: పెనుకొండ చెందిన న్యాయవాది తిప్పేనాయక్‌పై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్‌కు చెందిన స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు నాగార్జున, వాల్మీకి శ్రీనివాసులు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది తిప్పేనాయక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కరావులపల్లి తండా వద్ద హత్యాయత్నం చేశారన్నారు. అయితే త్రుటిలో ఆయన తప్పించుకున్నారన్నారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

'పెంకాక్ సిలాట్ 'లో ప్రతిభ


పెంకాక్ సిలాట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ట్రోఫీని అందుకుంటున్న జిల్లాకు చెందిన విద్యార్థులు

హిందూపురం టౌన్: కేరళలోని తిరువనంతపురంలో ఈనెల 1, 2వ తేదీల్లో పెంకాక్ సిలాట్ 4వ సౌత్ జోన్ పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున జిల్లా నుంచి హిందూపురం, పరిగి మండలాలకు చెందిన 12 మంది చిన్నారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో ఈశ్వర్, జయసీల్‌రెడ్డి, తనీశ్వర్‌రెడ్డి బంగారు పతకాలు , సాయి రేవంత్, చంద్ర కిశోర్ బ్రాంజ్ పతకాలు, బాలికల్లో మధుర, తన్విత‌రెడ్డి, శరణ్య, దివ్యలు బంగారు పతకాలు, రక్షిత బ్రాంజ్ మెడల్, మీన సిల్వర్ మెడల్ సాధించింది. నవంబర్‌లో బీహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు జిల్లా అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సౌత్ జోన్ సెక్రటరీ మనోజ్‌సాయి, ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ భరద్వాజరెడ్డి, జిల్లా పెంకాక్ సిలట్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫిక్ అహ్మద్ అభినందించారు.

ద్విచక్ర వాహనాల ఢీ

అమరాపురం: మండలంలోని మద్దనకుంట పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని మద్దనకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కెంచప్ప మద్దనకుంట గ్రామం నుంచి పొలానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. మరో వైపు అదే గ్రామానికి చెందిన సన్నీరప్ప ద్విచక్ర వాహనంపై మద్దనకుంట క్రాస్ వద్ద వేగంగా వచ్చారు. రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కెంచప్ప ఎడమ కాలు విరిగింది. దీంతో వెంటనే ఆయన్ను వెంటనే హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భౌ..భౌ

- పెనుకొండలో వీధి కుక్కల హల్‌చల్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న జనం
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు



పెనుకొండ: పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కకాటు బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇళ్లు విడిచి బయటకు వస్తే చాలు అమాంతంగా దాడి చేస్తున్నాయి. గత శుక్రవారం పెనుకొండ పట్టణంలో ఐదుగురు కుక్కకాటుకు గురయ్యారు. ఏకంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోకి కుక్క దూరడంతో ప్రజలు, సిబ్బంది, రోగులు బెంబేలెత్తిపోయారు.

అన్ని ప్రాంతాల్లోనూ...

నియోజకవర్గంలోని సోమందేపల్లి, పరిగి, రొద్దం, గోరంట్ల మండల కేంద్రాల్లో సైతం కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఏకంగా మండల మాదిరి రోడ్లపై ఉండటంతో ఎక్కడ ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందో తెలీని పరిస్థితి. కుక్కల భయంతో వృద్ధులు, మహిళలు బిక్కుబిక్కుమంటూ వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు హడలెత్తిపోతున్నారు. స్కూళ్ల వెళ్లి తిరిగి ఇంటికి చేరే వరకూ ఆందోళన చెందుతున్నారు. ఇక చికెన్ సెంటర్లు, మటన్ సెంటర్ల వద్ద చికెన్, మటన్ కొనుగోలు చేసి తీసుకొస్తున్న వారిపై అమాంతం దాడి చేసి ఎత్తుకుపోవడం, దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నాయని జనం వాపోతున్నారు. గతంలో గుట్టూరుకు చెందిన జీవాశ్రమం నిర్వాహకులు కుక్కలను బంధించి వాటిని కొన్ని రోజుల పాటు ఆశ్రమంలో ఉంచుకుని వాటికి ర్యాబిస్ వ్యాక్సిన్‌లు వేసి వదిలేవారని, కానీ నేడు ఆశ్రమం మూతపడడంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పెనుకొండ నగర పంచాయతీలో కుక్కలను నియంత్రించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. ఏఏ ప్రాంతాల్లో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయో గుర్తిస్తాం. కుక్కలు పట్టడంలో అనుభవం ఉన్న వారిని పిలిపించి వాటిని పట్టించి బయట ప్రాంతాల్లో వదలివేస్తాము.

– వంశీకృష్ణభార్గవ్, కమిషనర్, పెనుకొండ

క్లుప్తంగా

ఏపీజీబీ ద్వారా రైతులకు రుణాలు



మినీ ట్రాక్టర్‌ను రైతుకు అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ నాగరమణ

రొళ్ల: ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంక్ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు అందిస్తున్నట్లు ఆ శాఖ మేనేజర్ నాగరమణ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని గుడిబండ ప్రధాన రోడ్డులోని ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంక్ ద్వారా జీరిగేపల్లికి చెందిన రైతు దొడ్డప్ప కుమారుడు పి.లక్ష్మప్పకు (ఎంఎస్ఎంఈ) మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ద్వారా రూ.5 లక్షలు విలువ గల మినీ ట్రాక్టర్‌ను అందజేశారు.

పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని చింతారామచంద్రారెడ్డి ఇంటి సమీపంలోని కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పైపులైన్ ఏర్పాటుకు గ్రామ పంచాయితీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బుధవారం సర్పంచ్ సరోజబాయి, స్థానిక ప్రజాప్రతినిధులు పైపులైన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోముశేఖర్, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో పశువైద్య శిబిరం


పశువులను పరీక్షిస్తున్న వైద్యుడు క్రిష్టప్ప

హిందూపురం టౌన్: మండలం పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ పథకం కింద బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు క్రిష్టప్ప గ్రామంలోని 39 కుటుంబాలకు చెందిన 87 పశువులను పరీక్షించి, సూది మందులు వేశారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. పశువులకు వచ్చే పలు వ్యాధుల గురించి వివరించి, ఎలా సురక్షితంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు.

పది మంది బైండోవర్

రొళ్ల: మండల పరిధిలోని ఆర్.గొల్లహట్టిలో వారం రోజుల క్రితం భూ తగాదాలో బోరన్న, గడ్డ జోగన్న, కరే బోరన్న, జోగన్నతో పాటు సిద్దలింగప్ప, రామన్న, సిద్దప్ప, శ్రీధర్ తదితరులు ఘర్షణ పడ్డారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ హసీనాసుల్తానా ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు. అనంతరం వారిని స్వంత పూచికత్తుపై విడుదల చేశారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించండి


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ భాస్కర్

అగళి: మండల పరిధిలోని మాధూడి ఉన్నత పాఠశాలను బుధవారం ఎంఈఓ భాస్కర్ తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఏ –2 పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం దాసేగౌడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.4.5 లక్షల అందజేత


చెక్కు అందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని పి రొప్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలో దివ్యాంగులకు బుధవారం అధికారులు రూ.4.5 లక్షల చెక్కు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని 103 మంది దివ్యాంగుల బాగోగుల కోసం ఒక్కొక్కరికీ రూ.4 వేలు చొప్పున మొత్తం రూ 4.5 లక్షలను అందించారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షురాలు రూప నాగరాజు, ఉపాధ్యక్షుడు శంకరనాయక, ఎంఆర్‌డబ్ల్యూ అధికారి మైలారెడ్డి, పీడీఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

సోమఘట్టలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

చిలమత్తూరు: మండలంలోని సోమఘట్ట ఆర్బీకే వద్ద 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన సోమఘట్టలో ఏర్పాట్లను పర్యవేక్షించి స్థానికులకు అవగాహన కల్పించారు.

తూమకుంటలోనూ...

హిందూపురం అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం తూమకుంట సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కెంచరాయప్ప తెలిపారు. బుధవారం ఎంపీపీ రత్నమ్మ, డాక్టర్ ఆదిశేషు, సచివాలయ సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు.

హుండీ కానుకల లెక్కింపు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ఉదయం 11 గంటలకు శాశ్వత హుండీ కానుకలను లెక్కిస్తున్నట్లు ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థి నందకిశోర్‌రెడ్డిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం


ఆది

గోరంట్ల: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నందకిశోర్‌రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యయుడు ఫణికుమార్ తెలిపారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో నందకిశోర్‌రెడ్డి ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నందకిశోర్‌రెడ్డిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న సి.ఆది అనే విద్యార్థి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినిని అభినందించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


అమర్‌నాథ్ (ఫైల్)

హిందూపురం అర్బన్: పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు వడ్డే అమర్‌నాథ్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా, నాగరాజు, లక్ష్మీనారాయణ, చందు, ప్రజా సంఘాల నాయకులు ఉమర్‌ఫారూక్‌ఖాన్, ఉదయ్‌కుమార్, గంగాధర్, తదితరులు అమర్‌నాథ్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

అమర్‌నాథ్‌మృతి బాధాకరం

హిందూపురం: హిందూపురం 9వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు అమర్‌నాథ్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. బుధవారం ఫోన్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీలో చురుకైన నాయకుడ్ని కోల్పోవడం బాధాకరమన్నారు. కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

సోమందేపల్లి: మండలంలోని స్నేహలతనగర్‌లో చంద్ర అనే వ్యక్తిపై లక్ష్మినారాయణ, సంతోష్ దాడి చేసి కులం పేరిట దూషించిన ఘటనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి ఇంటి వద్ద చంద్రతో ఉద్దేశ పూర్వకంగా గొడవపడి దాడి చేయగా తలకు గాయమైనట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

పాఠశాల తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని ఎల్‌కే పల్లి, ఎల్‌కే పల్లి వడ్డ హట్టి పాఠశాలను ఎంఈఓ-2 శ్రీధర్ బుధవారం తనిఖీ చేశారు. ఎండీఎం నిర్వహకులు తయారు చేసిన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనాన్ని పిల్లలకు వడ్డించాలని సూచించారు. తర్వాత ఆయా పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. తర్వాత విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.